సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 15-2-2025

సంపుటి: 20 సంచిక: 275

పేజీలు: 8 వెల: రూ.1





## 'సత్యం' కథనాన్ని ట్వీట్ చేసిన లోకేష్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శుక్రవారం 'సత్యం' పత్రికలో వచ్చిన 'అచ్చెన్న ఆదేశాల ఫైల్ మాయం' కథనంపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు 'సత్యం' కథనాన్ని ట్వీట్ చేసి తక్షణమే స్పందించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమవుతున్న బీసీ భవనంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ అనురాధ మోకాలడ్డుతున్నారని బీసీ సంఘాలు, విద్యార్థులు చేస్తున్న ఆందోళనపై 'సత్యం' ప్రధానంగా ప్రస్తావించింది. 'సత్యం' కథనాన్ని చదవిన మంత్రి లోకేష్ బీసీ స్టడీ సర్కిల్ వల్ల కోచింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి సవితకు సూచించారు. బీసీ స్టడీ సర్కిల్‌కు సంబంధించిన అంశాన్ని పరిశీలించి స్పందించాలని మంత్రి సవితకు మంత్రి లోకేష్ ట్వీట్ ద్వారా సూచించారు.

# స్కూల్స్‌కు వాలంటైన్స్ డే సెలవు!

- తెలుగు రాష్ట్రాల్లో జరుపుకోని ముస్లిం పండగ పేరు చెప్పి వాడకం
- మార్చితో సెలవులు ముగుస్తున్నాయనే పథకం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**షబ్-ఇ-బరాత్.. ఈ పేరెప్పుడైనా విన్నారా? చదువుతుంటే ముస్లిం సంస్కృతికి సంబంధించిన పేరని మాత్రమే అర్థమవుతుంది కదా. మీకే కాదు.. ఈ జిల్లాలో గాని, తెలుగు రాష్ట్రాల్లో గాని షబ్-ఇ-బరాత్ అని పేరు చెబితే గుర్తుపట్టే ముస్లింలు లేరు. కానీ ఇది ఒక పండగ. ఈ విషయం మన జిల్లాకు చెప్పింది అరబ్బులో, ఆఫ్ఘనీలో, ఇస్లాం మత ప్రవక్త మహమ్మద్ మాత్రం కాదు.. సాక్షాత్తు మన గురుదేవులు, ప్రభుత్వ ఉపాధ్యాయులే. దక్షిణ, మధ్య, ఆగ్నేయ ఆసియాలతో పాటు మధ్యప్రాచ్యంలో జరుపుకొనే పండగిది. ఎక్కడ చూశారో, ఎలా చూశారో తెలీదు గానీ ఒక ఆప్షనల్ హాలీడేను తమకు అనుకూలంగా వాడుకోడానికి హైదరాబాద్‌లో కూడా జరుపు కోని ఈ పండగ పేరుతో శుక్రవారం జిల్లాలో కొన్ని మండలాల్లో హైస్కూల్ ఉపాధ్యాయులు మూకుమ్మడిగా ఆప్షనల్ హాలీడే తీసుకున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా ఆప్షనల్ హాలీడే ప్రకటించారంటూ ఉపాధ్యాయ వర్గాల్లోనే శుక్రవారం పెద్ద ఎత్తున కామెడీ ట్రాక్ నడిచింది.**

అసలు ఈ ఆప్షన్ హాలీడే అంటే ఏమిటి? దాన్ని ఎందుకు స్థానిక పరిస్థితుల బట్టి ప్రకటించాలి అన్న విషయాన్ని ఒకసారి ఇక్కడ ప్రస్తావిస్తే మన ఘనత చెందిన ఉపాధ్యాయులు ఎంత పొందికగా ఈ సెలవును వాడేశారన్నది అర్థమవుతుంది. ప్రతీ ఏడాది పబ్లిక్ హాలీడేస్‌తో పాటు 12 నుంచి 15 ఆప్షనల్ హాలీడేలను ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఇందులో ఓ ఐదు సెలవులను స్థానికంగా ఉన్న యంత్రాంగం నిర్ణయం తీసుకునే విధంగా విడిచి పెడుతుంది. ఉదాహరణకు శ్రీకాకుళం నగరంలో బాలికలకు ప్రత్యేకంగా పాఠశాలలు ఉన్నా కూడా వరలక్ష్మీవ్రతం లాంటి నోములు జరిగినప్పుడు ప్రభుత్వం పబ్లిక్ హాలీడేగా ప్రకటించదు. అటువంటప్పుడు స్థానిక ఎంఈవో అనుమతితో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆప్షనల్ హాలీడే ఇవ్వొచ్చు. అలాగే శివరాత్రికి ప్రభుత్వం పబ్లిక్ హాలీడేగా సెలవిస్తుంది. కానీ జాగారం చేసిన వారు మరుసటిరోజు రాలేరని ఆ రోజు ఆప్షనల్ హాలీడే ప్రకటిస్తారు. ఇక భోగీ, సంక్రాంతికి మాత్రమే సెలవిచ్చే ప్రభుత్వం కనుమ రోజు ముక్కలు, కక్కలు తింటాం కాబట్టి రాలేమంటే సెలవివ్వదు. అందుకే స్థానికంగా ఆప్షనల్ హాలీడే ప్రకటిస్తారు. ఇవి కాకుండా గ్రామాల్లో అమ్మవారి పండగలైనప్పుడు ప్రధానోపాధ్యాయుడి చొరవతో ఆప్షనల్ హాలీడే ప్రకటిస్తారు. ఇందుకోసం ఐదు రోజుల సెలవులు ప్రధానోపాధ్యాయుడి ద్వారా ఎంఈవో చేతిలో ప్రభుత్వం పెడుతుంది. కానీ జిల్లాలో మాత్రం శ్రీకాకుళం రూరల్, సరుబుజ్జిలి, పొందూరు, జి.సిగడాం వంటి మరికొన్ని మండలాల్లో శుక్రవారం ప్రేమికుల రోజు సందర్భంగా ఆప్షనల్ హాలీడేను ప్రకటించారని ప్రచారం జరిగింది. ఆ పేరు చెప్పుకుంటే బయటకు బాగోదు కాబట్టి ఇక్కడ జరుపుకోని షబ్-ఇ-బరాత్ అనే పండగ పేరును చూపించారు. వాస్తవానికి షబ్-ఇ-బరాత్ ఇస్లాం కేలండర్ ప్రకారం ఎనిమిదో నెల షాబాన్ మాసంలో 14 లేదా 15వ తేదీ రాత్రి జరుపుతారు. చంద్రుడి ఆధారంగా చేసుకునే ఈ రాత్రిపండగను సిక్కోలు గురువులు తెర మీదకు తెచ్చారు. పదో తరగతి పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు శనివారం, ఆదివారం తేడా లేకుండా పాఠాలు చెప్పాలని ప్రభుత్వం టైమ్‌టేబుల్ నిర్ణయించడంతో తమ ఆప్షనల్ హాలీడేలు ఉత్తినే పోతున్నాయని భావించిన ఉపాధ్యాయులు మధ్యప్రాచ్యం అంటే ఇరాన్, ఇరాక్ ప్రాంతాల్లో కూడా అంతంత మాత్రంగా జరుపుకొనే పండగను తెర మీదకు తెచ్చారు. ఈ విద్యాసంవత్సరంతో ఆప్షనల్ హాలీడేలు ముగుస్తాయి. ఇవి వాడుకోపోతే వచ్చే విద్యాసంవత్సరానికి సెలవులు తగ్గిపోతాయని భావించారో, లేదూ అంటే కొత్త పండగలను తెర మీదకు తెద్దామనుకున్నారో తెలీదు గానీ జిల్లాలోని అనేక మండలాల్లో షబ్-ఇ-బరాత్ పేరు చెప్పి అందరు ఎంఈవోల నుంచి ఆప్షనల్ హాలీడే అనుమతులు తీసుకున్నారు. అసలు ఇంతవరకు ఈ పేరే వినని ఉపాధ్యాయులకు ఈ సలహా ఎవరిచ్చుంటారు, అందరూ ఒకే పేరుతో ఆప్షనల్ హాలీడేకు ఎందుకు దరఖాస్తు చేసుకున్నారన్నదే తేలడంలేదు. సాధారణంగా ఆప్షనల్ హాలీడే ఓ పండగ సందర్భంగా ఇవ్వాల్సి వచ్చినప్పుడు ఆ మతానికో, ఆ ప్రాంతానికో సంబంధించిన విద్యార్థులు 80 శాతం మంది ఉండాలి. కానీ షబ్-ఇ-బరాత్ అంటే ఏమిటని ఇక్కడ పెద్ద మసీదు అధ్యక్షుడ్ని అడిగితే, మనం చేసుకోని పండగ ఇదొకటని ఆయన ఒక్క ముక్కలో తేల్చేశారు. కనీసం పాఠశాలల్లో సాంఘిక శాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయుడు కూడా సెలవు వస్తుందంటే పండగ చేసుకున్నారు తప్ప ఇదేమిటని ప్రశ్నించలేదు. షబ్-ఇ-బరాత్ అంటే 'క్షమారాత్రి'. ఇరాన్‌లో సమాధుల వద్దకు వెళ్లి ధూపాలు వేసి వచ్చే ఒక రాత్రి. చనిపోయిన వారి ఆత్మలను గౌరవించే పండగ. ఈ క్షమారాత్రి మన గురువులకు క్షమాభిక్ష ప్రసాదించుగాక..!

# సుధాకరా.. నీతో వేగలేమురా..!



- గూగుల్‌మీట్‌లో డబుల్‌మీనింగ్ మాటలు
- సమావేశానికి ఆలస్యమైతే ఎక్కడ పడుకున్నావంటూ ప్రశ్నలు
- సమయపాలన లేకుండా సమావేశాలు
- కొద్ది రోజుల్లోనే 103 మంది సిబ్బందికి మెమోలు
- మంత్రి ముందుకు డ్వామా పంచాయితీ
- వారంతా దొంగలని కలెక్టర్‌కు ముక్తాయించిన పీడీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

"ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నవారంతా దొంగలు.. ప్రతి పనిలో డబ్బులు తినేస్తున్నారు.. దానికి అడ్డుకట్టు వేయడానికి చర్యలు తీసుకుంటే ఉద్యోగులంతా ఏకమై దండయాత్ర చేస్తున్నారు, వేధిస్తున్నానంటూ ఫిర్యాదులు చేస్తున్నారు సర్!" ..ఇదీ డ్వామా పీడీపై ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం రాత్రి వివరణ కోరితే ఆయన ఇచ్చిన సమాధానం.

జిల్లా నీటి యాజమాన్య సంస్థలో ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. సంస్థ పీడీ ప్రదర్శిస్తున్న తీరు ఉపాధి హామీ పథకంలో 20 ఏళ్లగా వివిధ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి రోజురోజుకు సమస్యలు తెచ్చి

- మిగతా చివరి పేజీలో

## మాజీ సైనికుల అధ్యక్షునిగా జనార్ధనరావు ఏకగ్రీవం



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస నియోజకవర్గ మాజీ సైనికుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షునిగా తాండ్ర జనార్ధనరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు ఆమదాలవలస మాజీ సైనికుల ఎన్నికల కమిటీ సభ్యులు, విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ పి.ఎస్.రావు, విశ్రాంత సుబేదార్ గురుగుబెల్లి సత్యనారాయణ, విశ్రాంత సుబేదార్ మేజర్ బర్రి సంజీవరావు, హానరరీ కెప్టెన్ జామి రమణయ్యలు ప్రకటించారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ఒక్క నామినేషన్ మాత్రమే రావడంతో జనార్ధనరావు ప్యానెల్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ప్రకటించి వారికి డిక్లరేషన్ ఫారంలు అందజేసినట్లు ఎలక్షన్ కమిటీ తెలిపింది. ప్యానెల్‌లో అధ్యక్షునిగా తాండ్ర జనార్ధనరావు, ఉపాధ్యక్షునిగా పైడి సూర్యారావు, జనరల్ సెక్రటరీగా నానుపాత్రుని రామారావు, కోశాధికారిగా బొడ్డేపల్లి శ్రీనివాసరావు, కోఆర్డినేటర్‌గా పొన్నాడ శ్రీనివాసరావు ఉన్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం పాల్గొన్నారు.




# కాంపౌండ్ వాల్ కట్టడానికి కాలువ కప్పేశారు..!



- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- లాంగ్‌లీవ్‌లో శానిటేషన్ సెక్రటరీ
- అసలు విషయం తెలియక ప్రజల గగ్గోలు
- కప్పేసిన కాలువకు, సచివాలయానికి మధ్య దూరం 50 అడుగులే



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**కాలువలు సరిగా తీయడంలేదురా బాబూ.. కంపుతో ఉండలేకపోతున్నాం.. దోమల దాడి పెరిగిపోయింది.. విషజ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్నామని గగ్గోలు పెడుతున్న ప్రజలకు సైనిక్ పార్క్ కాంపౌండ్‌వాల్ పుణ్యమాని మరింత సమస్య ఎదురైంది.**

ఇందిరానగర్ కాలనీలో మిర్తిబట్టికి ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో ఎప్పుడో కట్టబోయే సైనిక్ పార్క్‌కు కాంపౌండ్ వాల్ కోసం కాంట్రాక్టర్ కాలువనే ఇసుక బస్తాలతో ఏకంగా కప్పేశారు. దీంతో వెనుక ప్రాంతాల రోడ్లపై కాలువ నీరు పొంగి పొర్లుతోంది. ఎందుకు కాలువలు నిండిపోయాయో అసలు విషయం ఎవరికీ తెలియదు. పార్క్ కాంపౌండ్‌వాల్ కట్టే కాంట్రాక్టర్ మాత్రం కాలువ మూయకపోతే గోడ కట్టడం ఎలా సాధ్యమవుతుందని తిరిగి ప్రశ్నిస్తున్నారు.

**మిర్తిబట్టి..** ఇది ఒకప్పుడు పంటపొలాలకు నీరందించే పిల్లకాలువ. కాలనీవాసుల ఆక్రమణల పుణ్యమాని చిన్నదిగా మారిపోయింది. ఎప్పుడైతే నగరంలో పొలాల్లో ఇళ్లు లేచాయో పంటకాలువ కాస్త మురికికాలువగా మారిపోయింది. నగరంలో రెండొంతుల ప్రాంతంలో ఉన్న కాలువల నుంచి మురుగునీటిని నదిలోనో, లేదా మరోచోటో కలిపే ప్రధాన మార్గం మిర్తిబట్టే. అంటే మిర్తిబట్టిలో ఎక్కడ అడ్డంకులున్నా నగరంలో రెండొంతుల భాగం జలమయమైపోవడం స్థానికులకు తెలుసు. ఇప్పుడు ఇదే మిర్తిబట్టికి ఆనుకొని ఇందిరానగర్ కాలనీలో సైనిక్ పార్క్ ఒకటి నిర్మిస్తారట. దీని కోసం ముందుగా ప్రహరీ కడుతున్నారు. సుందరీకరణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియదు

- మిగతా చివరి పేజీలో



### ఇబ్బందే.. అయినా తప్పదు

ఖాళీ స్థలంలో పార్క్ నిర్మాణానికి ప్రతిపాదన చేశాం. దానిలో భాగంగా నగరపాలక సంస్థ రూ.40 లక్షలు సాధారణ నిధులు వెచ్చించి చుట్టూ ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేయనున్నాం. ప్రహరీ నిర్మాణంలో భాగంగా పునాదులు వేయడానికి కాలువలో నీరు చేరకుండా అడ్డు పెట్టాం. ఇది కొంత ఇబ్బందికర పరిస్థితే అయినా తప్పదు. గతంలో ఇది పంటకాలువగా ఉండేది. ప్రస్తుతం మురికికాలువగా మారిపోయింది. దీనివల్లనే సమస్య ఉత్పన్నమైంది.

- దక్షిణామూర్తి, ఎంఈ

• ఎడిటోరియల్

# జనగణన ఎప్పుడో మరి..!?

ప్రభుత్వాలు ఏదైనా కొత్త పథకాన్ని ప్రకటించటానికి ముందుగా చేసే కసరత్తు సదరు పథకం ఏ తరగతి ప్రజల కోసం? ఆ తరగతి ప్రజలు మొత్తం జనాభాలో ఎంతమంది ఉన్నారు అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోవటం. అంటే ఓ పథకం ప్రకటించాలన్నా మొత్తం జనాభా ఎంతో తెలియాలి. అందులో సదరు ప్రభుత్వానికి వచ్చిన ఆలోచనల ఫలితంగా రూపొందే పథకానికి ఎందరు అర్హులో నిర్ధారించాలి. ఎంతమంది అర్హులు అన్నదాన్ని బట్టే సదరు పథకాన్ని అమలు చేయటానికి ఎంత ఖర్చు అవుతుందో అంచనా వస్తుంది. ఇది సాధారణంగా జరిగే పరిపాలనపరమైన చర్య. కానీ గత పద్నాలుగేళ్లుగా భారతదేశంలో జనగణన జరగలేదు. అయినా కేంద్ర ప్రభుత్వం పథకాలు వండి వడ్డిస్తూనే ఉంది. బడ్జెట్లు కేటాయిస్తూనే ఉంది. పేదరికం తగ్గిస్తూనే ఉంది. అసలు మొత్తం జనాభా ఎంత, అందులో పేదలెందరు అన్నది లెక్కే తేలినప్పుడు పేదరికం తగ్గింపు గజం మిథ్య పలాయనం మిథ్య అన్న చందమే కదా. పదేళ్లకొకసారి జరిగే జనగణన చివరిసారిగా 2011లో జరిగింది. అంటే 2021లో మళ్లీ జరగాలి. దానికి ముందే దాదాపు 2019 నుంచి లేదా కనీసం 2020 నుంచి అయినా కసరత్తు ప్రారంభం కావాలి. అంటే ప్రశ్నావళి రూపొందించటం, జనగణన చేయాల్సిన సిబ్బందికి ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించటం, వివిధ భాషల్లో ప్రశ్నావళిని అచ్చు వేసి సిద్ధం చేయటం వంటి పనులు ప్రారంభం కావాలి. కానీ కేంద్రం ఇవేవీ చేపట్టలేదు. జమ్ము కాశ్మీర్‌ను ముక్కలు చేయటానికి ఉన్నంత ఆసక్తి అప్పట్లో కేంద్రానికి జనగణన మీద లేకపోయింది. దేశవ్యాప్తంగా రాజకీయ పక్షాలే కాక మేధావులు, గణాంక నిపుణులు విమర్శలు ఎక్కుపెట్టిన తర్వాత కోవిడ్ కారణంగా జనగణన వాయిదా వేస్తున్నామని ప్రకటించింది. కోవిడ్ దిగ్బంధనం ముగిసి ఇప్పటికి నాలుగేళ్లు. ఆర్థికవ్యవస్థ కూడా కోవిడ్ ప్రభావం నుంచి పూర్తిగా తేరుకున్నది, కోలుకున్నది అంటున్నారు. అలాంటప్పుడు ఇప్పటికైనా జనగణన చేపట్టకపోవటంలో ప్రభుత్వం ఆంతర్యం ఏమిటన్న ప్రశ్న దేశం ముందున్నది. తాజాగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సైతం జనగణన ఊసెత్తలేదు. రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో సైతం జనగణన జరిగింది. కానీ ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత కూడా జనగణన చేపట్టే అవకాశాలు కనుచూపుమేర కనిపించటం లేదు. ఉదాహరణకు జాతీయ ఆహార భద్రత పథకం కింద 75 శాతం గ్రామీణ జనాభా, 50 శాతం పట్టణ ప్రాంత జనాభాకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ధరలకు ఆహారధాన్యాలు సరఫరా చేయాలి. గత బడ్జెట్‌లో కేటాయింపులపై విమర్శలు వచ్చినప్పుడు జనాభా అంచనాల ప్రకారం కేటాయింపులు సవరిస్తామని పార్లమెంట్‌లో హామీ ఇచ్చింది. అదే అంచనాల ప్రకారం అయితే ఇప్పటికి కనీసం 110 కోట్ల మంది ఈ పథకం కింద లబ్ది పొందేందుకు అర్హులవుతారు. కానీ ఈ సంఖ్యను నిర్ధారించిందీ లేదు. కేటాయింపులు పెంచిందీ లేదు. ఇదే సమస్య ఇతర అన్ని పథకాలకూ వర్తిస్తుంది. మహిళలకు చట్టసభల్లో మూడోవంతు సీట్లు రిజర్వు చేస్తామని, జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్వ్యవస్తీకరణ పూర్తి చేసి మహిళలకు ఏ నియోజకవర్గాలు రిజర్వు చేయాలో నిర్ణయిస్తామని బిల్లు ఆమోదం సందర్భంగా ప్రధాని మొదలు హోంశాఖ మంత్రి వరకూ పార్లమెంట్‌లో వాగ్దానం చేశారు. ఇంతవరకూ జనగణనే మొదలు కానప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించీ ఫలితం లేకుండా పోతుంది. ప్రభుత్వం జనగణన విషయంలో అనుసరిస్తున్న వైఖరికి రెండు ప్రధాన కారణాలున్నాయని భావిస్తున్నారు. మొదటి అంశం కేంద్ర ప్రభుత్వానికి వాస్తవాలు అంగీకరించే లక్షణం స్వభావం లేదు అన్నది గత జాతీయ నమూనా సర్వే సంస్థ, జాతీయ గణాంక సంస్థలను నిర్వీర్యం చేయటం ద్వారా మనకు అర్థమవుతుంది. చివరకు అంతర్జాతీయ సంస్థలు కూడా భారతదేశం గురించి ప్రాథమిక విషయాలు ఖరారు చేసుకోవడానికి కావల్సిన విశ్వసనీయమైన గణాంకాలు అందుబాటులో లేవని ఎత్తి చూపింది. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు. ఇక రెండో కారణం శాస్త్రీయ దృక్పథం మీద ప్రభుత్వానికి ఉన్న విముఖత. గత పదేళ్లకుపైగా వివిధ సందర్భాల్లో ప్రభుత్వాధినేతలు, విధాన కర్తలు చేస్తున్న ప్రకటనల సారాంశం దేశంలో మూఢవిశ్వాసాలను పెంపొందించటం. జనగణన దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను శాస్త్రీయ దృక్కోణంలో అర్థం చేసుకుని, విశ్లేషించటానికి అవకాశం కలిగిస్తుంది. గణాంకాలు అందుబాటులో ఉంటే స్వతంత్ర మేధావులు కూడా తమ తమ అధ్యయనాలు సాగిస్తారు. వాస్తవాలు వెలుగులోకి తెస్తారు. ప్రభుత్వ విధాన వైఫల్యాలు బట్టబయలవుతాయి. అందువల్లనే సాధ్యమైనంత వరకూ జనగణన వాయిదా వేస్తోందన్న అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల అవసరాలకూ, బడ్జెట్ కేటాయింపులకు మధ్య ఎటువంటి సంబంధం లేకుండా చివరకు బడ్జెట్ కసరత్తు కూడా అర్థంలేని కసరత్తుగా మారే ప్రమాదం ఉంది.

# జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

(సత్యంన్యూస్, టెక్కలి)

మండలంలోని జెడ్పీ హైస్కూల్ బూరగాం పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి సదాశివుని తిరుమల చైతన్య శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశీలించారు అనంతరం ప్రీఫైనల్ పరీక్ష రాస్తున్న 10వ తరగతి విద్యార్థులను పరిశీలించి ఎలా రాస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్నారు స్థానిక ప్రాథమిక పాఠశాలలో తనిఖీచేసి విద్యార్థులతో సామూహికంగా కూర్చుని పిల్లలతో ముచ్చటించారు. కొన్ని కథలను వారిచే చెప్పించుకుని వారిచే కూరగాయల పేర్లు ఆహార పదార్థాల పేర్లు రాయించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అభ్యాసన బాగుందని అభినందించారు హైస్కూల్లో పరిసరాలు విద్యార్థుల క్రమశిక్షణ చూసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామును అభినందించారు. పాఠశాల సముదాయాలు ఏర్పాట్లు పరిశీలించి అందులో భాగంగా పాఠశాలలో తనిఖీ చేసినట్లు తెలియజేశారు మధ్యాహ్న భోజన పథకాన్ని హైస్కూల్లో తనిఖీ భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు



# అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాత్రిపూట వచ్చే డయల్ 100,112 కాల్స్ పట్ల తక్షణమే స్పందించాలని, నేరాలు నియంత్రణకు రాత్రిపూట గస్తీ విధులు అప్రమత్తంగా నిర్వర్తించాలని పోలీస్ సిబ్బందిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఆమదాలవలస, నరసన్నపేట పోలీస్‌స్టేషన్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో స్టేషన్లో రాత్రి పహారా (సెంట్రి) సిబ్బంది వివరాలు, ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో కేటాయించిన బీట్లు సిబ్బంది వివరాలు, వారు తిరిగే బీట్ పాయింట్లు ఆరా తీసి, బీట్ సిబ్బంది ప్రతి ఒక్కరు అప్రమత్తంగా పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తించాలని తెలిపారు. సెంట్రీ కానిస్టేబుల్ అప్రమత్తంగా ఉంటూ జిల్లా పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే డయల్ 100,112 కాల్స్ పట్ల తక్షణమే స్పందించి, ఆయా స్టేషన్ల పరిధిలో గల బీట్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ సంబంధిత ఫిర్యాదితో ఫోన్ ద్వారా మాట్లాడి బాధితులు ఉన్న చోటికి చేరుకుని సమస్య పరిష్కారానికి నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళలో ఆపదతో పోలీస్‌స్టేషన్‌కి వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టే దిశగా విధులు నిర్వర్తించి, ప్రతి విషయాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని, వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని బీట్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు.

## హైవే పెట్రోలింగ్ తనిఖీ..

ఆమదాలవలస, నర్సన్నపేట పోలీస్ స్టేషన్లు తనిఖీ అనంతరం మార్గమధ్యంలో నరసన్నపేట – శ్రీకాకుళం మార్గమధ్యలో ఉన్న హైవే పెట్రోలింగ్ వాహనాన్ని తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడుతూ నిరంతరం వాహన తనిఖీలు చేస్తూ, అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తూ ఉండాలన్నారు. పశువుల అక్రమ రవాణా చేసే వాహనాలు గుర్తించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌కి అప్పగించాలని సూచించారు. రాత్రివేళలో ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంటాయి కాబట్టి టోల్‌ప్లాజాల వద్ద వాహనా చోదకులకు ఫేస్‌వాష్ నిర్వహించాలన్నారు. 24/7 నిరంతరం జాతీయ రహదారిపై పెట్రోలింగ్ వాహనంతో గస్తీ నిర్వహిస్తూ అక్రమ రవాణా, ఇతర నేరాలు నియంత్రణకు పట్టిష్టంగా విధులు నిర్వహించాలన్నారు.

## అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీకాకుళం జిల్లా వైద్యాధికారి బాల మురళీకృష్ణ మాట్లాడుతూ అవయదానంపై అవగాహన లేక, ఎవరూ ముందుకు రావటంలేదని, అవయవదానం చేయడంవలన కొంతమంది జీవితాలలో వెలుగులు చూడొచ్చన్నారు. అవయవాలు కోసం ఎంతోమంది జీవన్ దాన్ ద్వారా ఎదురు చూస్తున్నారని, అవయవాలు పనితీరు, దానం చేయడానికి ఉపయోగపడే అవయవాల కోసం విద్యార్థినిలకు తెలియజేసారు. శ్రీకాకుళంలో పదేళ్ల బాలుడు సైతం తన అవయవాలను దానం చేశారని, వారి తల్లితండ్రులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రాణాలు కాపాడటంలో భాగమయ్యారన్నారు. రెడ్‌క్రాస్ మేనేజర్ జి.రమణ మాట్లాడుతూ మన దేశంలో రోజూ రోడ్డు ప్రమాదాల్లో వందల మంది చనిపోతున్నారని, బ్రెయిన్‌డెడ్ , ఇతర కారణాలతో చనిపోయిన వారి అవయవాల్ని ఇతరులకు అమర్చటం ద్వారా మరెన్నో కుటుంబాలకు మేలు చేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ శివ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె వేణు,ఎన్ ఎస్ఎస్ పిఓ ఎల్. మోహనరావు, రెడ్‌క్రాస్ మేనేజర్ రమణ, సేవకులు ఉర్లం శివతేజ, విద్యార్థినిలు పాల్గొన్నారు.




## 80 అడుగుల రోడ్డులో హోటళ్ల తనిఖీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

80 అడుగుల రోడ్డులో నిర్వహిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తయారుచేసే ఆహార పదార్థాలకు సంబంధించి శాంపిల్స్ సేకరించి ఎనాలిసిస్ చేస్తామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులకు ఆహార పదార్థాలు సరఫరాపై పలు సూచనలు జారీ చేశారు. ఈ తనిఖీలో ఫుడ్ సేఫ్టీ అధికారి కె.లక్ష్మి పాల్గొన్నారు.






# గోల గోల!

గ్యాప్ లేకుండా సినిమాలు అందించే యంగ్ హీరో విశ్వక్సేన్ నుంచి వచ్చిన కొత్త చిత్రం.. లైలా. అతను హీరోగానే కాక కథలో కీలకమైన లైలా అనే లేడీ క్యారెక్టర్ కూడా చేసిన సినిమా ఇది. కొత్త దర్శకుడు రామ్ నారాయణ్ రూపొందించిన ఈ చిత్రం వేలంటైన్స్ డే కానుకగా ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

**కథ:**

సోను (విశ్వక్సేన్) హైదరాబాద్ ఓల్డ్ సిటీలో తన తల్లి వారసత్వంగా వచ్చిన బ్యూటీ పార్లర్ నడుపుతుంటాడు. అతడికి అక్కడ మాంచి లేడీ ఫాలోయింగ్ ఉంటుంది. కానీ ఈ ఫాలోయింగ్ కొంతమందికి నచ్చదు. దీనికి తోడు ఇబ్బందులు పడ్డ వాళ్లందరూ తన పతనం కోసం ఎదురు చూస్తుంటారు. ఇలాంటి సమయంలోనే రుస్తుం (అభిమన్యు సింగ్) అనే రౌడీ.. సోను చేసిన ఓ పనితో అతడి మీద పగ పెంచుకుంటాడు. ఈ క్రమంలోనూ సోను శత్రువులంతా కలిసి అతణ్ని పెద్ద స్కాంలో ఇరికిస్తారు. దీంతో సోను ఎవరి కంటా పడకుండా దాక్కోవాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఆ స్థితిలో అతనేం చేశాడు.. తన ఐడెంటిటీని దాచిపెట్టి తన సమస్యలన్నీ ఎలా పరిష్కరించుకున్నాడు.. అన్నది మిగతా కథ.

**సాంకేతిక వర్గం:**

'లైలా'లో సాంకేతిక హంగులు పర్వాలేదనిపిస్తాయి. లియోన్ జేమ్స్ పాటల్లో విశేషంగా చెప్పుకోదగ్గవేమీ లేవు. ఏదో అలా అలా నడిచిపోయాయి. నేపథ్య సంగీతం బాగానే సాగింది. రిచర్డ్ ప్రసాద్ కెమెరా పనితనం బాగుంది. నిర్మాణ విలువలు మాత్రం బాగున్నాయి. నిర్మాతలేమీ రాజీ పడలేదు. వాసుదేవ మూర్తి రైటింగ్.. రామ్ నారాయణ్ డైరెక్షన్ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఈ రోజుల్లో ఇలాంటి కథతో.. ఇలాంటి టేకింగ్‌తో మెప్పించగలమని ఎలా అనుకున్నారో? కొన్ని సన్నివేశాలు.. డైలాగుల గురించి ఇక్కడ రాయడం కూడా చాలా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. మాస్.. కామెడీ పేరుతో మరీ అథమ స్థాయి సీన్లు రాసి.. తీసి వదిలేశారు.

**కథనం-విశ్లేషణ:**

'లైలా'లో ఒక సీన్లో వయసు మీద పడ్డా పెళ్లి కావట్లేదని ఫీలయ్యే విలన్.. తన చేతిని చూసుకుని బాధపడుతుంటాడు. ఏమైందని తండ్రి అడిగితే.. "నా జాతకం ఎలా ఉందని జ్యోతిష్యుడికి చూపిస్తే నీ చేతిలో రేఖలన్నీ అరిగిపోయాయి అన్నాడు" అంటూ ఏడుస్తాడు. ఇంకో సీన్లో మేకల దొడ్డిలో కూర్చున్న కమెడియన్ పృథ్వీ ఈ మేకలకు కొత్త ఆకులేమైనా వెయ్యండ్రా అంటూ ఏదో డైలాగ్ చెబుతాడు. దానికి అవతలున్న వ్యక్తి.. "ఆకులెందుకు కొత్తగా మొలిచిన నా..." అంటూ డైలాగ్ కంప్లీట్ చేసేస్తాడు. సెన్సార్ బోర్డు పుణ్యమా అని అక్కడో బీప్ సౌండ్ వచ్చినా డైలాగ్ ఏంటన్నది ప్రేక్షకులకు సులువుగానే అర్థమైపోతుంది. మరో సన్నివేశంలో ఓ పాత్రధారి.. "ఆ సోనుగాడు ఓల్డ్ సిటీలో ఉన్న లేడీస్ అందరినీ ఏస్తున్నాయ్" అంటాడు. ఏం ఏస్తున్నాయిరా అని అడిగితే.. "మేకప్ ఏస్తున్నాయ్" అంటాడు. 'లైలా' ఎంత లో లెవల్ సినిమానో చెప్పడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. డైలాగులే మాత్రమే ఇలా ఉన్నాయేమో అనుకోవడానికి లేదు. కొన్ని దృశ్యాల గురించి ఇక్కడ వర్ణించే సాహసం కూడా చేయలేం. "విశ్వక్సేన్ సినిమా అంటే ఎంతో కొంత కంటెంట్ ఉంటుంది" అనే పేరును చెడగొట్టుకోవడానికి పనిగట్టుకుని అతను 'లైలా' చేశాడేమో అనిపిస్తుంది. దీన్ని బీట్ చేసే అథమ స్థాయి సినిమాను అతను మళ్లీ చేయగలడా అన్నది కూడా సందేహమే.

'లైలా' ప్రమోషనల్ ఇంటర్వ్యూల్లో ట్రైలర్లోని డైలాగులు.. సీన్ల గురించి తక్కువ చేసి మాట్లాడుతుంటే.. సినిమా చూడకుండానే ఓ నిర్ణయానికి రావొద్దని అన్నాడు విశ్వక్సేన్. నిజానికి 'లైలా' టీం అక్కడ చూపించింది జస్ట్ ట్రైలర్ మాత్రమే. అసలు సినిమా తెర మీద కనిపిస్తుంది. ట్రైలర్‌ను మించిన బూతు సన్నివేశాలు.. డైలాగులు సినిమాలో కోకొల్లలు. బోల్డ్ సీన్లకు.. బూతు డైలాగులకు ఈ తరం ప్రేక్షకులు ఎంత అలవాటు పడిపోయినా సరే.. ఇందులోని కంటెంట్ తట్టుకోలేని స్థాయిలోనే అనిపిస్తుంది. సన్నివేశాలు-సంభాషణలు బోల్డ్‌గా ఉండడం వేరు.. వల్గర్‌గా అనిపించడం వేరు. 'లైలా' రెండో కోవకే చెందుతుంది. భామనే సత్యభామనే.. మేడమ్.. లాంటి చిత్రాల్లో హీరోలు ఆడవేషం వేసి తమకు ఎదురైన సమస్యను పరిష్కరించుకోవడం చూశాం. అందులో హీరోలు ఆడవేషం వేయడానికి బలమైన కారణం కనిపిస్తుంది. దాని చుట్టూ ఒక ఎమోషన్ రన్ అవుతుంది. వినోదం పండించడానికి ఆయా పాత్రలు బాగా ఉపయోగపడ్డాయి. కానీ 'లైలా'లో హీరోతో ఆడవేషం వేయించడానికి అంత బలమైన కారణమే కనిపించదు. ఇదంతా ఒక బలవంతపు వ్యవహారంలా అనిపిస్తుంది. ఇదంతా ఒకెత్తయితే.. కథానాయికతో హీరో రొమాంటిక్ ట్రాక్ మరో ఎత్తు. హీరోను చూడగానే మంటెత్తిపోయే హీరోయిన్.. తనను మీదికి ఎత్తుకుని పార్కులో పరుగులు తీయగానే ఒంట్లో సెగలు పుట్టేసి తనకు పడిపోతుంది. పదే పదే హీరోయిన్ అవయవాల మీద కెమెరా ఫోకస్ చేసిన తీరుతోనే ఈ సినిమా స్థాయి ఏంటో ఒక అంచనాకు వచ్చేయొచ్చు. లాజిక్‌ను పూర్తిగా కొండెక్కించేస్తూ.. బూతుల డోస్ ఇంకా పెంచుతూ ద్వితీయార్థంలో వచ్చే సన్నివేశాలు సినిమాను ఇంకా ఇంకా కింది స్థాయి తీసుకెళ్లిపోతాయి. ఇందులో 'పండు' చుట్టూ నడిపిన కొన్ని కామెడీ సీన్లయితే మరీ వల్గర్ అనిపిస్తాయి. ఏమాత్రం బలంగా అనిపించని.. ఎమోషన్ లేని.. రొటీన్ సీన్లతో 'లైలా' చికాకు పెడుతుంది. కామెడీ సైతం పెద్దగా వర్కవుట్ కాలేదు. చివరి వరకు కూర్చునిమమ అనిపించాలే తప్ప పతాక సన్నివేశాల్లో కూడా 'లైలా' ఏమాత్రం ఆసక్తి రేకెత్తించదు. విశ్వక్‌కే కాదు.. అభిమానులకూ ఇది పూర్తిగా మరిచిపోదగ్గ చిత్రమే.

**నటీనటులు:**

విశ్వక్సేన్ 'లైలా' అవతారం కోసం కష్టపడ్డాడు. ఆ పాత్రలో తన బాడీ లాంగ్వేజ్.. హావభావాలు అవీ బాగానే ఉన్నాయి. సోను పాత్రలో విశ్వక్ లుక్ బాగుంది. ఆ క్యారెక్టర్లో పెర్ఫామెన్స్ అయితే కొత్తగా ఏమీ అనిపించదు. ఓవరాల్ గా విశ్వక్ అయితే తన తన పాత్రకు న్యాయం చేశాడు. హీరోయిన్ ఆకాంక్ష శర్మను ఒక గ్లామర్ డాల్ గా చూపించడానికి ప్రయత్నించారు. ప్రతి సన్నివేశంలోనూ కెమెరా ఆమె అందాల మీదే ఫోకస్ చేసింది. కొన్నిసార్లు కెమెరా యాంగిల్స్ టూమచ్ అనిపిస్తాయి. నటన పరంగా ఆకాంక్ష గురించి చెప్పడానికి ఏమీ లేదు. 'గబ్బర్ సింగ్' విలన్ అభిమన్యు సింగ్ స్థాయి ఎంత పడిపోయిందో చెప్పడానికి ఈ సినిమా ఒక ఉదాహరణ. అతను చేసిన రుస్తుం పాత్ర.. తన నటన విసుగు తెప్పిస్తాయి. పృథ్వీ.. పృథ్వీరాజ్.. మిగతా నటీనటులు కూడా చాలా మొక్కుబడిగా నటించినట్లు అనిపిస్తుంది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...



# వివిధ నాగరకతల్లో పవిత్ర స్నానాలు!

ప్రయాగ్‌రాజ్‌లో పన్నెండేళ్ల కొకసారి జరిగే మహాకుంభ మేళా 45రోజుల పాటు జరుగుతుంది. బహుశా ప్రపంచంలోనే ఇది అతిపెద్ద సామూహిక పవిత్ర స్నానాలు చేసే సందర్భంగా రికార్డు అయ్యింది. కుంభమేళా గురించి చర్చించుకునేటపుడు చరిత్ర, నమ్మకాలు, కథలు, కాల్పనిక ఘట్టాలు ఒకదానికొకటి ముడి వేసుకుని ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖులను కుంభమేళా ఎలా ఆకర్షించింది? వివిధ నాగరికతల్లో పవిత్రస్నానం సాంప్రదాయం ఏమిటి అన్న విషయాలు తెలుసుకుందాం.

- మొహమ్మద్ ఆసిం సిద్దికి

### మహాకుంభ్ : తిరునాళ్ల, ధార్మిక ఉత్సవం

మహాకుంభ్ ప్రపంచవ్యాప్తంగా భక్తులనే కాదు. రచయితలు, ప్రజా నాయకులను కూడా ఆకర్షించింది. 1897లో భారతదేశానికి వచ్చిన అమెరికన్ నవలా రచయిత మార్క్ ట్వైన్ తన ఫాలోయింగ్ ది ఎంక్వయిరర్: జరన్నీ అరౌండ్ ది వరల్డ్ అన్న గ్రంథంలో కుంభమేళా ప్రస్తావన ఉంది. కుంభమేళాకు వచ్చే ప్రజల్లో నాటుకుపోయిన భక్తిప్రపత్తుల గురించి వివరణలూ ఉన్నాయి. ఆయన మాటల్లో

“కుంభమేళాకు వచ్చిన భక్తులు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వస్తున్నారు. ఎండనక, వాననక, నెలలతరబడి ప్రయాణం చేసి వచ్చిన వాళ్లు కూడా ఉన్నారు. ప్రయాణంలో తెచ్చుకున్న సామాగ్రి అయిపోయి కడుపు మాడ్చుకుని వచ్చిన వారూ ఉన్నారు. వాళ్లందరినీ నడిపించింది ఒక్కటే. ప్రగాఢమైన విశ్వాసం. ఒకసారి ప్రయాగరాజ్‌లో స్నానం చేసిన తర్వాత వాళ్లలో సంతృప్తి, సంతోషం పెల్లుబుకుతోంది. జీవితానికి సరిపడా తృప్తి చెందుతున్నారు. జీవితంలో చేసిన పాపాలన్నీ కడుక్కోబోతున్నారు. ఈ పవిత్ర జలాల్లో స్నానమాచరించిన తర్వాత వాళ్లు పట్టు కుందల్లా బంగారమైపోతుందన్న నమ్మకంతో వస్తున్నారు.

“కేవలం వాళ్లకున్న భక్తిప్రపత్తులు, నమ్మకం కారణంగానే దేశంలో పలుప్రాంతాల నుండి యువకులు, వృద్ధులూ, ఆరోగ్యవంతులు, రోగిష్టులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వస్తున్నారు. మార్గమధ్యంలో ఎదురయ్యే కష్టాలు, నష్టాలు, బాధల గురించి కించిత్తు విచారం కూడా వ్యక్తం చేయటం లేదు. నమ్మకం, విశ్వాసాలకున్న శక్తి అదేనేమో. ఇదంతా ప్రేమతో జరుగుతున్న, జరుపుతున్న వ్యవహారం. నాకు అర్థం కావటం లేదు. దీనివెనక ఉద్దేశ్యం ఏమైనా మాలాంటి వారికందరికీ ఇదో అద్భుతమేనన్నారు. తన పరిశీలనను నమోదు చేస్తూ ఇది ఓ తిరునాళ్ళ, ధార్మిక ఉత్సవం అని అభిప్రాయపడ్డారు.

### మొహంజొదారో, రోమన్ నాగరికతల్లో సామూహిక స్నానాలు

హాజరవుతున్న జనసంఖ్య రీత్యా మహాకుంభ అతి పెద్దదే అయినప్పటికీ ఇదే మొదటిది కాదు. వివిధ నాగరికతల్లో సామూహిక స్నానాల సాంప్రదాయం ఉంది. ఈ సందర్భాలు ప్రధానంగా ఒకరినొకరు కలుసుకోవడానికి, తెలుసుకోవడానికీ ఏర్పాటు చేసిన సందర్భాలు. క్రీస్తు పూర్వం మూడో శతాబ్దం నాటికే సింధు నాగరికత విలసిల్లిన మొహంజొదారో ప్రాంతాల్లో సామూహిన స్నానపు తొట్లు ఉన్నాయని, నివాస ప్రాంతంలో ఉండేవారంతా కలిసే స్నానం చేసేవారని మనకు ఇప్పుడు ఆధారాలతో వెల్లడైంది. సింధు నాగరికత నాటికే ఇంటింటికీ స్నానపు గదులు, మురుగునీటి పారుదల వ్యవస్థలు ఏర్పాటైనా సామూహిక స్నానపు వసతులు ఓ క్రతువుగా జరిగేవని పరిశోధకులు వెల్లడిరచారు.

సముద్రాలు కావచ్చు, నదులు, కాలువలు, చెరువులు, కుంటలు లేదా ఆధునిక కాలం నాటి స్పాలు, ఈతకొలనులూ వంటి సామూహిక స్నానపు కేంద్రాలు వివిధ నాగరికతలు, సంస్కృతుల్లో కీలక స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఉదాహరణకు రోమన్ నాగరికతలో కూడా క్రీస్తు పూర్వం 3000 సంవత్సరం ప్రాంతంలో బహిరంగ స్నానాలు, సామూహిక స్నానాలు సామాజిక కారక్రమాలుగానే ఉండేవి. పురావస్తు ఆధారాలు, లిపిశాస్త్రం,



సాహిత్య వనరులు ద్వారా సంగ్రహించిన చరిత్ర ఆధారంగా అమెరికాకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు గారెట్ జి ఫగన్ రాసిన రోమన్ సామ్రాజ్యంలో బహిరంగ స్నానాలు గ్రంథంలో “రోమన్ సామ్రాజ్యంలో ఈ క్రతువులు ఆధునిక కాలంలో మస్సాజ్ పార్లర్, స్నానపు గది, జిమ్నాజియంల కలగలుపుగా ఉంటుంది..అని వివరించారు. భవననిర్మాణ శాస్త్రం, శాసనాలు వంటివాటిల్లో ఈ బహిరంగ స్నానవాటికలు నిర్మాణం విధివిధానాలు, రీతిరివాజులు గురించి విపులంగా ప్రస్తావించబడింది. బట్టలు విప్పటం మొదలు శరీరంపై లేపనాలు అద్దటం, చెమటలుకారేవరకూ వ్యాయామం చేయటం, శరీరాన్ని ఇటువంటి రాయితోనో, మరో సున్నితమైన వస్తువుతోనో (ఇప్పట్లో మనం చూస్తున్న స్క్రబ్స్ లాంటివి) శుభ్రం చేసుకోవటం, వేడినీళ్ల గదిని ఎంచుకుని స్నానానికి ఉపక్రమించటం వంటి పద్ధతులు గురించి వివరమైన ప్రస్తావనలున్నాయి. వర్గవిభజితమైన రోమన్ సమాజంలో వేర్వేరు సామాజిక తరగతులకు వేర్వేరు స్నానపు వాటికలుండేవి. చిన్నవి, పెద్దవీను. భారీ స్నానపు వాటికలు ధర్మేలనీ, చిన్నవాటిని బాలనీలని పిలిచేవారు. వీటన్నింటిలో వచ్చిన వారికి స్నానాలు చేయించటానికి, ఒళ్లు శుభ్రం చేయటం, ఇతర సంబంధిత పనులు చేయటానికి బానిసలు సిద్ధంగా



ఉండేవారు. ఈ రకమైన స్నానపు క్రతువుల వలన ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని పలు వ్యాఖ్యానాలు ప్రస్తావిస్తున్నాయి. ఆ కాలంలో రోమ్ నగరంలో నివశించే గ్రీకు భౌతికశాస్త్రవేత్త అస్క్లెపైడెస్ ఆరోగ్యం కోసం స్నానం చేయాలని ప్రతిపాదించాడు. అయితే బహిరంగ స్నానపు వాటికల్లో పారిశుద్ధ్యం కొరత, మురుగునీటి వ్యవస్థ లేకపోవటం వంటి వాటివలన ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తాయి.

### ముస్లిం దేశాల్లో హమ్మమ్

టర్కీ, ట్యునీషియా, ఇరాన్ వంటి ముస్లిం దేశాల్లో ఉండే ఈ సాంప్రదాయాన్ని హమ్మమ్ అంటారు. ఈ సాంప్రదాయపు విధి విధానాలు పరిశీలిస్తే రోమన్ సంస్కృతి ప్రభావం ఉన్నట్లుగా కనిపిస్తుంది. కాకపోతే రోమన్‌లో స్త్రీపురుషులకు ఉమ్మడిగా స్నానవాటికలు ఉంటే ముస్లిం దేశాల్లో వేర్వేరుగా ఉండేవి. రోమన్ తరహాలోనే హమ్మమ్‌లో కూడా లేపనాలు, వ్యాయామం, శుద్ధి వంటి క్రమం పాటించేవారు. కాకపోతే ఇవన్నీ స్నానపు గదులకే పరిమితమయ్యేవి. ఒకేచోట ఏర్పాటుచేసిన స్నానపు గదుల్లో ఈ క్రతవులు పాటించేవారు. టర్కీలో ఈ స్నానపు ఘట్టాలు విలక్షణమైనవే అయినప్పటికీ ట్వైన్ టర్కీ సందర్శించినప్పుడు ఆయన బాగా నిరాశ చెందారు.



“చూడటానికి ఓ గ్రామీణ ప్రాంతంలోని ఆసుపత్రిలా ఉండేదే తప్ప మరేమీ లేదు. అని రాశారు. కానీ నిజానికి పితృస్వామిక పరదా వ్యవస్థల కట్టుబాట్ల నుండి అరబ్ దేశాల్లో హమ్మమ్‌కు వచ్చేటప్పుడు మాత్రమే స్వేచ్ఛ దొరికేది. పాలస్తీనా కవి ఫద్వా తుగన్ రాసిన కొండలు గుట్టలు దాటి: ఓ ఆత్మకథలో చిన్నతనంలో తల్లితో కలిసి ఇటువంటి సామూహిక స్నానఘట్టాలకు వెళ్లటం ఎంత ప్రాణానికి ఎంత హాయిగా ఉండేదో వివరించింది. నబ్లస్ నగరంలో ఇటువంటి స్నానపు వాటికలకు వెళ్లటం మహిళలకు వ్యాహ్యాళికి వెళ్లినట్లు ఉండేదని తెలిపింది. తుగన్ మాటల్లో “ ఈ మహిళలను చూస్తే ఎంతో ఆహ్లాదంగా ఉండేది. వాళ్ల జీవితాలు వాస్తవాలకు దగ్గరగా వుండేవి. కులీన కుటుంబాలకు చెందిన మహిళల జీవితాల్లో కనిపించే పటాటోపం, భేషజం వీరిలో కనిపించేది కాదు.”

### ఇతర సంస్కృతుల్లో సామూహిక స్నానాలు

నైలు నదిలో స్నానం చేయటం ఎంతో పవిత్రమైనదిగా భావించేవారు ఈజిప్షియన్లు. విశాలమైన నీటి తొట్లును వాడేవారు ఈజిప్షియన్లు. అదే విధంగా రష్యన్ సంస్తృతిలో ఈ సాంప్రదాయాన్ని బోన్యా అని పిలిచేవారు. ఇక్కడ కూడా బహిరంగ స్నానాలు, సామూహిక స్నానాలు పవిత్రతతోనూ, శుద్ధి, నిర్మలత్వం, మోక్షం వంటి భావనలతో ముడిపడి ఉండేవి.

కొరియాలో ప్రకృతిసిద్ధమైన వేడినీటి వనరులు ఇటువంటి బహిరంగ స్నానవాటికలుగా ఉండేవి. వీటిని జ్జిమిజిల్బాంగ్ అని పిలిచేవారు. స్త్రీలు, పురుషులు వేర్వేరుగా స్నానాలకు వెళ్లేవారు. అప్పుడపుడూ ఈ కేంద్రాలకు కుటుంబాలకు కుటుంబాలు వ్యాహ్యాళిగా వెళ్లేవి. ఫిన్లాండ్‌లో సౌనాస్ అనే సాంప్రదాయం నేటికీ అమల్లో ఉంది. అక్కడ కూడా ఆరోగ్యకారణాలతో పాటు సామాజిక వేదికలుగా అమలు జరుగుతున్నాయి. ఓ పౌరకూడిక సందర్భంగా ఉండేవి.

జపాన్‌లో ఇటువంటి బహిరంగ సామూహిక స్నానాలు క్రీస్తు శకం ఆరో శతాబ్దంలో మొదలయ్యాయి. 19వ శతాబ్దం వరకూ ఉనికిలో ఉన్నాయి. కృత్రిమ వేడినీటి కేంద్రాలను సెంటోస్ అనీ, ప్రకృతి సిద్ధమైన వేడినీటి పాయలను ఆన్సెన్ అనీ పిలుస్తారు. జనం కలుసుకునే సందర్భంతో పాటు ధార్మికత, ఆరోగ్యం కోసం కూడా ఈ కేంద్రాలకు వచ్చేవారు.

జపాన్‌లో స్త్రీపురుషులు ఉమ్మడిగా ఉపయోగించుకునే కేంద్రాలను కొన్యోకు ఆన్సెన్ అని పిలిచేవారు. ఇవి కూడా 19వ శతాబ్ది వరకూ ఉనికిలో ఉన్నాయి. రానురాను వ్యక్తిగత గోప్యత, నగ్నత్వం గురించి భావనలు నాగరికతల్లో వేళ్లూనుకోవటంతో క్రమంగా ఈ సాంప్రదాయాలు కనుమరుగవుతూ వచ్చాయి.

# సివిల్ లైబిలిటీ యాక్ట్ సవరణతో తీవ్రనష్టం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి లొంగిపోయి సివిల్ లైబిలిటీ యాక్ట్‌ను సవరించడం తీవ్ర నష్టమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ మెంబరు నంబూరు షణ్ముఖరావు విమర్శించారు. కోటబొమ్మాళిలో సీపీఎం నాయకులు హనుమంతు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సివిల్ లైబిలిటీ యాక్ట్ సవరించడం వలన అణుప్లాంట్ ప్రమాదాలు జరిగితే వాటికి నష్టపరిహారం చెల్లించే బాధ్యత నుండి కంపెనీలు తప్పుకుంటాయని వారు విమర్శించారు. కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రం మితివిర్దిలో పెట్టాల్సిన అణువిద్యుత్ కేంద్రాన్ని అక్కడ ప్రజలు వ్యతిరేకిస్తే బీజేపీ ప్రభుత్వం అక్కడ రద్దు చేసి ఆంధ్రప్రదేశ్‌లో కొవ్వాడకు తరలించారని విమర్శించారు. రాష్ట్ర శాసనసభలో కొవ్వాడ అణుపార్కుకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కొవ్వాడలో అణుపార్క్‌ను పెట్టడమంటే ఉత్తరాంధ్రలో అణుబాంబు పెట్టడమేనని అన్నారు. కొవ్వాడ భూకంపాల జోన్లో ఉందని, ఇక్కడ అణుపార్కు పెట్టడం అత్యంత ప్రమాదకరమని తెలిపారు. ఈ ప్రాంతం అధిక జన సాంద్రత ప్రాంతం అని ప్రకృతి వైపరీత్యాల వలన గాని, మానవ తప్పిదం వలన గాని, యంత్రం లోపం వలన గానీ ఏ చిన్న ప్రమాదం జరిగినా ఇటు కాకినాడ నుండి అటు ఒరిస్సా ఛత్రపూర్ వరకూ నాశనం అవుతుందని, భూమి, నీరు, గాలి సమస్తం విషతుల్యం అవుతాయని లక్షలమంది ప్రాణాలు గాలిలో కలిసిపోతాయన్నారు. అణుపార్క్ వలన విడుదల అయ్యే రేడియో ధార్మికత వలన భూమి, నీరు, గాలి, ఆహార పదార్థాలు విషతుల్యం అవుతాయని, ప్రజలు క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడతారని, పుట్టే పిల్లలు వికృత ఆకారాలతో పుడతారని తెలిపారు. రేడియో ధార్మికత ఎంతవరకు వ్యాపిస్తే ఆ ప్రాంతంలో ఆహారపదార్థాలు విషతుల్యమౌతాయన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములను నాశనం చేసి, జనసాంద్రత గల ప్రదేశమైన కొవ్వాడలో అణుపార్క్ పెట్టడానికి పాలకులు పూనుకోవడం దారుణమన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా, జర్మనీ, జపాన్ లాంటి సాంకేతిక పరిజ్ఞానం గల దేశాలు అణువిద్యుత్ కేంద్రాలను మూసివేస్తున్నారన్నారు. 1979లో అమెరికా త్రీమైల్ ఐలాండ్లో అణుప్రమాదం జరిగిన తరువాత కొత్తగా అణువిద్యుత్ కేంద్రాలు పెట్టలేదన్నారు. 1986లో చెర్నోబిల్ అణుప్రమాదం జరిగినా అక్కడ మానవాళికి నివసించడానికి వీలులేకుండాపోయిందన్నారు. కాలిఫోర్నియాలో ఉన్న అణువిద్యుత్ కేంద్రాన్ని మూసివేయాలని అమెరికా చట్టం చేసిందన్నారు. అమెరికాలోని కరోలినా రాష్ట్రంలో అణువిద్యుత్తు కేంద్రం నిర్మాణానికి సుమారు రూ.60 వేలకోట్లు ఖర్చు చేసి ప్రమాదకరమని, మధ్యలో పని నిలుపుదల చేశారన్నారు. ప్రపంచంలో అత్యంత ఎక్కువ యురేనియం నిల్వలున్న ఆస్ట్రేలియాలో ఒక్క అణువిద్యుత్తు కేంద్రం కూడా లేదన్నారు. లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనంతో ఒకేచోట ఆరు అణు రియాక్టర్లు పెట్టడం దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజల ప్రాణాలకు పెను ప్రమాదం వాటిల్లుతుందన్నారు. ప్రపంచమంతా అణువిద్యుత్తుకు భయపడి ప్రత్యామ్నాయ మార్గాలవైపు అడుగులు వేస్తుంటే మన పాలకులు ఎందుకు స్వాగతిస్తున్నారని ప్రశ్నించారు. అమెరికా కార్పొరేట్ ప్రయోజనాలు కోసమే కేంద్ర బీజేపీ ప్రభుత్వం కొవ్వాడలో అణుపార్కు పెడుతుందన్నారు. అణువిద్యుత్తు అత్యంత ఖరీదైనదని, అణువిద్యుత్ రేటు యూనిట్ రూ.25 ఖర్చవుతుందన్నారు. ప్రజల ప్రాణాలను పణంగాపెట్టి అంత ఖర్చు అయ్యే అణువిద్యుత్తు కేంద్రం అవసరమా? అని ప్రశ్నించారు. ప్రజలకు అత్యంత చౌకగా, ఎటువంటి ప్రమాదం లేని గాలి, నీరు, సూర్యరశ్మి మొదలగు వాటితో విద్యుత్ ఉత్పత్తి చేసి, ప్రజల అవసరాలను తీర్చవచ్చున్నారు. కాని అత్యంత ప్రమాదకరమైన, ఖరీదైన అణువిద్యుత్ కేంద్రాలు మనకు అవసరం లేదన్నారు. అణువ్యర్థాలు నిక్షిప్తం చేయడం చాలా కష్టమని, అత్యంత ప్రమాదకరమైన, అత్యంత ఖరీదైన అణువిద్యుత్ కేంద్రాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# జామియా మసీదు పరిశుభ్రత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని జామియా మసీదు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా పర్యటకాధికారి నారాయణరావు ప్రతి ఒక్కరికి స్వచ్ఛతే సేవ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ సిబ్బంది రమేష్, జిల్లా బోర్డు ఇన్స్పెక్టర్ షేక్ అబ్దుల్ సాధిక్, రియాజ్, జామియా మసీద్ అధ్యక్షులు మహీబుల్లా ఖాన్, గౌరవాధ్యక్షులు అమిరుల బేగ్, కార్యదర్శి షేక్ అక్బర్ బాషా, ఉస్మాన్, భాషా, మసీదు కార్య నిర్వహక సభ్యులు ఇర్ఫాన్, ప్రభుత్వ ఖాజీ గఅబ్దుల్ వహాబ్ , యాసీన్, గఫార్, సయ్యద్ షఫీ, జామియా మసీదు ముక్తి ముజీబుర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



# 26న శివరాత్రి ఉత్సవాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



దక్షిణ కాశీగా పేరు గాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో వారాహి సమేత శ్రీ ముఖలింగేశ్వర స్వామి మహాశివరాత్రి మహోత్సవాలు ఈనెల 26న ఉదయం 3 గంటలకు జాగరణతో ప్రారంభమై అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవంతో ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ తెలిపారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 26న జరిగే ఉత్సవాలతోపాటు 27న పడియ ఉత్సవం నిర్వహిస్తామన్నారు. 28వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 12:20 నిమిషాలకు పార్వతీ పరమేశ్వర ఉత్సవ విగ్రహాలతో ఉత్తర దిశగా వంశధార నదిలో వేద మంత్రోచ్చారణ మధ్య త్రిశూల స్నానం అనగా చక్రతీర్థం ఘనంగా నిర్వహిస్తామన్నారు.


డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# సుధాకరా.. నీతో వేగలేమురా..!



(మొదటిపేజీ తరువాయి)

పెడుతుంది. డ్వామాలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది లింగభేదం చూడడం లేదని వాపోతున్నారు. టార్గెట్‌లు ఫిక్స్ చేసి పనులు పూర్తి కావాలని వేపుకు తింటున్నారని ఉద్యోగులు గత కొన్ని రోజులుగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల్లో చేయాల్సిన పని కేవలం గంటల వ్యవధిలో పూర్తి చేయాలని ఒత్తిడి పెంచి మెమోలు జారీ చేస్తున్నారు. మూడు నెలల్లో సుమారు 103 మంది ఉపాధి ఉద్యోగులకు మెమోలు ఇచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పీడీపై విమర్శలు ఉన్నాయి. గార, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో ఇటీవల 25 మందికి ఒకే రోజు మెమోలు జారీ చేసినట్టు ఉద్యోగులు చెబుతున్నారు. అర్ధరాత్రి వరకు కార్యాలయంలోనే సిబ్బందిని ఉంచి రాత్రి 8 తర్వాత జిల్లాలోని సిబ్బందితో గూగుల్ మీట్ నిర్వహిస్తూ ఆడ, మగ తేడా లేకుండా బండబూతులు తిట్టడం పీడీకి సర్వసాధరణమైపోయిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గూగుల్ మీట్‌లో ఎవరైనా ఉద్యోగులు పీడీ వాడే భాషపై అభ్యంతరం వ్యక్తం చేస్తే.. బెదిరించి పనిష్మెంట్లు ఇస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఉదయం టెలికాన్ఫిరెన్స్, మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్, రాత్రి గూగుల్‌మీట్ నిర్వహించి ఉద్యోగులు, సిబ్బందిని తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశిస్తున్నారు. **'మీరంతా తాత్కాలిక ఉద్యోగులు, మిమ్మల్ని తొలగించే అధికారం నా చేతిలోనే ఉంది'** అంటూ బెదిరించడం పీడీకి పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయపాలన పాటించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫీల్డ్‌లో ఉండే మహిళా ఉద్యోగులు కాన్ఫరెన్స్‌లకు ఆలస్యంగా హాజరైతే **'ఏ చెట్టు కింద పడుకున్నావు'** అంటూ పీడీ దుర్భాషలాడుతున్నట్టు బాధితులు చెబుతున్నారు. ఒక మహిళా పీవోకు రాత్రి 9 గంటలకు ఫోన్ చేసి గూగుల్ మీట్‌కు హాజరు కావాలని చెప్పాల్సిన పీడీ **'మొగుడు పక్కన పడుకున్నట్టు ఉన్నావు.. 10 నిమిషాల సమయం కేటాయించు.. అర్జెంట్ పని ఉంది'** అంటూ మాట్లాడినట్టు ఉద్యోగుల్లోనే చర్చ సాగింది. ఉద్యోగులెవరైనా తనకు వ్యతిరేకంగా మాట్లాడినా, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఆ సిబ్బందిని టార్గెట్ చేసి వేరే మండలాలకు పంపించి ఇబ్బంది పెడుతున్నారని పీడీపై ఆరోపణలు ఉన్నాయి. పీడీ మాటకు ఎవరైనా ఎదురు సమాధానం చెప్పినా, ఆలస్యంగా స్పందించినా మహిళలని కూడా చూడకుండా పరుష పదజాలం ఉపయోగించి మాట్లాడుతుండడం ఉద్యోగులకు మనస్థాపానికి గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, సిబ్బంది మత విశ్వాసాలను దెబ్బతీసేలా తరచూ మాట్లాడుతుంటారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఆయన ఏది చెబితే కలెక్టర్ అదే చేస్తారని, తన మాటకు తిరుగులేదని సమావేశాలు, కాన్ఫరెన్స్‌ల్లో పీడీ బహిరంగంగానే చెబుతుంటారని విమర్శలున్నాయి. పీడీ ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న అభ్యంతరకరమైన తీరుపై జిల్లాకు చెందిన మంత్రులు, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి మొరపెట్టుకున్నా సమస్యకు పరిష్కారం చూపించలేదని ఉద్యోగులు చెబుతున్నారు. గతంలో వివిధ హోదాల్లో పని చేసిన ప్రతి చోట ఇదే పద్ధతిలో వ్యవహరించేవారని పీడీపై ఆరోపణలున్నాయి.

పీడీ తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఏపీవో స్థాయి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు సుమారు 400 మంది కలిసి మానసికంగా, శారీరకంగా వేధించడం తగదని డ్వామా కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. ఆ తర్వాత పీడీని కలిసి టార్గెట్స్ పేరుతో ఒత్తిడి పెంచి మెమోలు జారీ చేయడం, వీసీ, టీసీ, గూగుల్ మీట్‌లో మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యకమైన భాషను వినియోగించడం మానుకోవాలని వినతి పత్రం అందించారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్‌వో వెంకటేశ్వరావును కలిసి పీడీపై ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి వరకు సిబ్బందిని కార్యాలయంలో ఉంచి ఇంటికి వెళ్లి కుటుంబంతో గడిపే పరిస్థితి లేకుండా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్వామా కార్యాలయంలో సుమారుగా 56 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 26 మంది మహిళా ఉద్యోగులు ఉన్నారు. 14 మంది ఉద్యోగులు వివిధ శాఖల నుంచి డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. కార్యాలయ సిబ్బందితో పాటు మండల స్థాయిలో ఉన్న టెక్నికల్ అసిస్టెంట్‌లో ఏపీవోలు ఇతర సిబ్బంది కూడా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సొంత అవసరాల కోసం, ఇంట్లో నిర్వహించే శుభకార్యాలకు సెలవు కావాలని కోరినా పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఇటీవల ప్రధానమంత్రి విశాఖపట్నం పర్యటనకు వచ్చిన సందర్భంగా జిల్లా నుంచి జనాలను బస్సుల్లో తరలించడానికి, వారిని ఇంటికి తిరిగి తీసుకురావడానికి వీలుగా డ్వామా కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. అందులో రాత్రి మూడు గంటల వరకు సిబ్బంది పని చేశారు. తర్వాత రోజు గంట పర్మిషన్ అడిగితే ఇచ్చేందుకు నిరాకరించిన పీడీ 10 గంటలకు కార్యాలయంలో ఉండాలని హుకుం జారీచేశారు. పీడీ తీరుపై టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగామ మండలాలకు చెందిన ఉపాధి అధికారులు, సిబ్బంది మంత్రి అచ్చెన్నాయుడును కలిసి విన్నవించారు. మంత్రిని కలిసి ఫిర్యాదు చేసినందుకు పీడీ సదరు ఉద్యోగులను బెదిరించినట్టు తెలిసింది. డ్వామా జిల్లా కార్యాలయంలో పని చేస్తున్న ఒక ఉద్యోగి కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసి ప్రతి రోజు ఉదయం 10 గంటలకు వెళ్లి రాత్రి 12 గంటలకు ఇంటికి వస్తున్నారని, దీని వల్ల ఫ్యామిలీ లైఫ్, ఆరోగ్యం పాడవుతుందని మొరపెట్టుకున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించలేదని బాధిత ఉద్యోగి పిల్లలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పథకం అమల్లో కీలక భూమిక పోషిస్తున్న సిబ్బందిని కించపరిచేలా మాట్లాడుతూ



బెదిరింపులకు దిగడమే కాకుండా దొంగలంటూ అభివర్ణించడాన్ని ఉద్యోగులు తప్పుపడుతున్నారు. రోజుకు ఎనిమిది పనిగంటలు వర్తింపజేయాలని, ఉపాధి చట్టంలో చెప్పబడిన రాజీలేని అంశాల ప్రాప్తికి మాత్రమే విధులను అప్పగించాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో ఉద్యోగులు కోరారు. పని ఒత్తిడి పెంచి తీవ్రస్థాయి వేధింపులు మానుకోవాలని ఉద్యోగులు విన్నవించారు. రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో వేతనాలు కల్పించి జిల్లాకు రూ.400 కోట్ల మెటీరియల్ కాంపొనెంట్ నిధులను సమకూర్చిన ఘనత జిల్లా ఉపాధిహామీ పథకం సిబ్బందికి దక్కుతుందన్నారు. సంక్రాంతి సమయంలో సెలవులు ఇవ్వకుండా వేధించినా భరించామని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల మనోభావాలు దెబ్బతినేలా కించపరిచేలా వ్యవహరిస్తే సీఎంవోకు ఫిర్యాదు చేస్తామని ఉద్యోగులు చెబుతున్నారు. ఇంజినీరింగ్ శాఖల సిబ్బంది చేయవలసిన పనులను ఉపాధి సిబ్బందితో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనులకు బిల్లులు, ప్రభుత్వ ఆదేశాల మేరకు పని వేళల్లో మాత్రమే చేస్తామని తెలియజేశారు. సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని, లేకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఉపాధి సిబ్బందికి జరుగుతున్న అన్యాయంపై మంత్రులకు కలిసి విన్నవిస్తామన్నారు.

---

### ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు
# సంపూర్ణ ఏర్పాట్లు చేయండి
### రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మార్చి 1 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలోని ఆర్‌ఐవో కార్యాలయంలో జిల్లా పర్యవేక్షణ అధికారి, పరీక్ష కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఇతర శాఖల అధికారులతో భేటీ నిర్వహించారు.

జిల్లా ఆర్‌ఐవో పి.దుర్గారావు జిల్లావ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరంలో ఎన్ని పరీక్షా కేంద్రాలు, జోన్లు ఏర్పాటు చేశారు, హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య, తదితర విషయాలు వివరించారు. సంపూర్ణ సదుపాయాల ఏర్పాటులో భాగంగా తాగునీటి సదుపాయం, వెలుతురు, మరుగు దొడ్లు, ఫ్యాన్లు, సరిపడినన్ని బెంచ్‌లు, కుర్చీలు ఏర్పాటుచేసేలా కళాశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసిందీ లేనిదీ సీతారాం అడిగి తెలుసుకున్నారు. మారుమూల ప్రాంతాల్లోని కళాశాలలకు హాజరయ్యే విద్యార్థులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా బస్సులు ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ అధికారులకు ముందస్తు ప్రణాళికలు అందజేసిందీ లేనిదీ, ట్రాఫిక్ సమస్యలు, పరీక్ష కేంద్రాల ప్రాంగణాల్లో ప్రాథమిక వైద్యం, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితో సంప్రదింపులు జరిపినదీ లేనిదీ అడిగారు. జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.దుర్గారావు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు సంబంధించి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి తగు సలహాలు సూచనలు అందజేశారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరీక్ష కమిటీ సభ్యులు భీమేశ్వరరావు, నారాయణరావు, సింహాచలం, శ్యాం, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు, ఎం.వాసుదేవ కుమార్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

---

# కాంపౌండ్ వాల్ కట్టడానికి కాలువ కప్పేశారు..!



(మొదటిపేజీ తరువాయి)

గానీ మిర్తిబట్టికి ఆనుకొని ప్రహరీ కడుతుండటం వల్ల మురికినీటి ప్రవాహానికి కాలువలో ఓ దగ్గర పూర్తిగా మూసేశారు. దీంతో దిగువ ప్రాంతంలో ఉన్న తుమ్మావీధి, కొన్నవీధి మెయిన్ రోడ్డు, పీఎస్ఎన్‌ఎం హైస్కూల్ వెనుకభాగం, జంగాలవీధిలు పూర్తిగా మురుగుతో మునిగిపోయాయి. ప్రవాహం ఉన్నచోట ప్రహరీలు నిర్మించాలంటే నీటి ప్రవాహాన్ని ఆపక తప్పదు. కానీ దీన్ని యుద్ధప్రాతిపదిక మీద చేయాలి. రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉంచడంతో పార్క్ కట్టడం వల్ల వచ్చే ఆహ్లాదం కంటే రోగాలబారిన పడిన ప్రజల బాధలు ఎక్కువవుతాయి. దీనిపై ప్రశ్నిస్తే రెండు రోజులు ప్రజలకు ఆమాత్రం ఇబ్బంది తప్పదని నగరపాలక అధికారులు అంటున్నారు. కాలువ కప్పిన గంటకే.. అదీ కుళాయిలు ఆగిపోయిన తర్వాత మురుగునీరు రోడ్డెక్కితే రెండు రోజుల మాట దేవుడెరుగు.. రెండో పూటకే రోడ్లపై ముడుకులకు పైన ఎత్తులో కాలువనీరు ప్రవహించడం ఖాయం. రోగాలు, దోమలు ప్రజలకు ఎలాగూ అలవాటైపోయాయి. డీసీసీబీ కాలనీ సచివాలయ శానిటేషన్ సెక్రటరీ లాంగ్‌లీవ్ పెట్టి సెలవులో ఉన్నారు. కాలువల విషయం ఎవర్ని సంప్రదించాలో తెలియక టీడీపీ వార్డు ఇన్‌ఛార్జిల వద్దకు వెళ్లి చెబితే, వారు కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి కాలువ పూర్తిగా మూసేస్తే ఎలా అని ప్రశ్నించారు. కనీసం నీరు ఎదురుగా ఉండే గెడ్డలోకి వెళ్లే మార్గం వదలాలని కోరారు. అయినా సదరు కాంట్రాక్టర్ దీనిపై స్పందించకపోవడం విచారకరం. ఇంకో విషయమేమంటే.. ఈ కాలువలో ఇసుక బస్తాలు వేసి కప్పెట్టిన 50 అడుగుల దూరంలో ఈ ఏరియా సచివాలయం ఉన్నప్పటికీ వారసలు పట్టించుకోలేదు.





---

# థర్మల్ ప్లాంట్ ప్రతిపాదనపై దశలవారీ ఉద్యమం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




థర్మల్ పవర్ ప్లాంట్ విరమించుకునేంత వరకు దశలవారి ఉద్యమం కొనసాగుతుందని అఖిలపక్ష రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు హక్కుల సంఘాలతో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అన్నారు. థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త యోగి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పర్యావరణానికి పచ్చదనానికి, ప్రకృతికి తీవ్రం నష్టం వాటిల్లే థర్మల్ పవర్ ప్లాంట్ వద్దని, థర్మల్ పవర్ ప్లాంట్‌కు వంశధార నీరు మళ్లిస్తే జిల్లా ఎడారిగా మారుతుందని, జిల్లాను సస్యశ్యామలం చేయాలంటే నదులు అనుసంధానం చేయాలని, కుటీర పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని వక్తలు కోరారు. ప్రజల కేంద్రంగా అభివృద్ధి ఉండాలని, పదిమంది పెట్టుబడుదారులకు లబ్ధి చేకూరేలా కొద్దిమంది వ్యక్తులు అభివృద్ధిని ప్రజల అభివృద్ధిగా చూపిస్తున్నారని ఆరోపించారు. పవర్ ప్లాంట్‌తో నష్టాలు లేవని ఎమ్మెల్యే పేర్కొనడాన్ని వారు ఆక్షేపించారు. దీనిపై బహిరంగం చర్చకు సిద్ధపడాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు కృష్ణమూర్తి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కే.వి.జగన్నాథం, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, వైకాపా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, వైకాపా నాయకులు తమ్మినేని చిరంజీవినాగ్, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్, సోంపేట పోరాట కమిటీ నాయకులు బీల ఢిల్లీరావు, బీసీ సంఘం నాయకులు చౌదరి లక్ష్మీనారాయణ, డీటీఎఫ్ గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, కేఎంపిఎస్ నాయకులు బెలమల ప్రభాకర్, పోరాట కమిటీ అధ్యక్షులు సురేష్ దొర, ప్రధాన కార్యదర్శి రవికాంత్, మహిళా సంఘం అధ్యక్షురాలు కృష్ణవేణి, కాకరపల్లి పోరాట కమిటీ అధ్యక్షుడు హన్నురావు, సరుబుజ్జిలి జడ్పిటిసి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

---

# 16న 2003 డీఎస్సీ ఫోరం సమావేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



2004 జనవరి ఒకటో తేదీకి ముందు వివిధ ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చి అప్పటి ప్రభుత్వాలు వివిధ కారణాల వల్ల ఉద్యోగ నియామకాలను ఆలస్యం చేసిన వివిధ కేటగిరీలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపింఛన్ అమలు చేయాలని కేంద్రం విడుదల చేసిన మెమో 57ను రాష్ట్రంలో అమలు జరిపేలా వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో 2003 డీఎస్సీ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న తేదీన ఉత్తరాంధ్ర జిల్లాల బాధితుల సమావేశం నిర్వహించనున్నట్టు ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ కొత్తకోట శ్రీహరి తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ పట్టణంలోని కళింగభవన్‌లో నిర్వహించే ఈ సమావేశానికి పెద్దసంఖ్యలో మూడు జిల్లాల బాధిత ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు.







Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.